

మేడం డైరెక్షన్.. అధికారుల ఓవరాక్షన్

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను టీడీపీలోకి లాక్కునేందుకు ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి పక్కా ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. - 8లో



ఎస్‌జీఎఫ్ కరాటే జిల్లా జట్లు ఎంపిక

రాజంపేట పట్టణం నూనెవారిపల్లె రోడ్డులోని కరాటే శిక్షణ కేంద్రంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లాస్థాయి కరాటే ఎంపికలు నిర్వహించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
31.4 /24.6

వాతావరణం

జిల్లాలో బుధవారం 24.6 – 31.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ బి. వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు నవభారత్ ఫెర్టిలైజర్స్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్ లాంటి సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని ఆయన అందులో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ సెల్ నెంబర్ 99664 52542, 89198 60680 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

పెన్నాకి భారీగా నీరు విడుదల

జమ్మలమడుగు : మైలవరం జలాశయం నుంచి పెన్నా నదికి అధికారులు భారీగా నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి పదివేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండటంతో నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు మైలవరం ఈఈ యు.రమేష్‌పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఐదుగంటల నుంచి 8వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని రమేష్ వెల్లడించారు. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రస్తుతం మైలవరం జలాశయంలో ఆరు టీఎంసీల నీరు నిల్వ ఉందని.. వచ్చిన నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న ఔట్ ఫ్లో

కొండాపురం: గండికోట జలాశయం నుంచి 2వేల నుంచి 10 వేల క్యూసెక్కుల వరకు నీటిని పెంచి మైలవరం జలాశయానికి విడుదల చేస్తున్నట్లు జలవరులశాఖ డీఈ ఉమమహేశ్వర్లు తెలిపారు. ఆవుకు రిజర్వాయర్‌లో 12 వేల క్యూసెక్కులనీరు పెరగడంతో అక్కడ వచ్చిన నీటిని జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ ద్వారా గండికోట జలాశయానికి కృష్ణ జలాలు వస్తున్నాయన్నారు. గండికోట జలాశయంలో బుధవారం సాయంత్రానికి 25.9 టిఎంసీల నీటి మట్టం నిల్వ ఉందన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖలోని మిషన్ వాత్సల్య పథకం, బాల సదనాల్లో స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్, డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్ ఆఫీసర్ పోస్టులకు బుధవారం జరిగిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన 31 మంది అభ్యర్థులకు వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సామర్థ్య పరీక్ష నిర్వహించారు. కమలాపురం సీడీపీఓ వసంతభాయి, డీసీపీఓ సుభాష్ యాదవ్, ఇతర అధికారులు ఈ పరీక్షలను పర్యవేక్షించారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : దసరా పండుగ సెలవుల రద్దీని పురస్కరించుకుని జిల్లాలోని ఆరు డిపోల నుంచి వివిధ ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులు, విద్యార్థులకు వారి స్వగ్రామాలకు వచ్చేందుకు అక్టోబరు 8 నుంచి సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. హైదరాబాదుకు 90, బెంగుళూరుకు 70, విజయవాడ 30, చెన్నై 10, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురంలకు 30 బస్సులు చొప్పున మొత్తం 230 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని మరిన్ని సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు. తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా అక్టోబరు 7, 8 తేదీలలో తిరుపతికి ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. ఇప్పటికే అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, దూర ప్రాంతవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే పౌర్ణమిని పురస్కరించుకుని అక్టోబరు 16న జిల్లాలోని ఆరు డిపోల నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు.

ఇదేం విజన్ బాబూ!

- టెక్నాలజీ సెంటర్ తరలింపుపై జిల్లా వాసుల ఆగ్రహం
- అన్నీ అమరావతికే తరలిస్తే ప్రాంతీయ అసమానతలకు దోహదం కాదా
- కార్యాచరణకు సిద్ధమవుతున్న పార్టీలు, సంఘాలు
- నోరు మెదపని కూటమి ఎమ్మెల్యేలు





కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కొప్పర్తి ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని అమరావతికి తరలిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం జిల్లాలో ప్రకంపనలు రేపుతోంది. ఈ అంశంపై న్యాయపోరాటం చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రకటించింది. సీపీఐ నాయకులు బుధవారం ఇందుకు సంబంధించిన జీఓ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఆందోళనలు చేపడతామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు హెచ్చరించారు. వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు భవిష్యత్ కార్యచరణకు సిద్ధమవుతున్నాయి. మీరా.. పెట్టరు....ఉన్న వాటిని అభివృద్ధి చెందిన అమరావతి ప్రాంతానికి తరలించుకుపోయి ప్రాంతీయ అసమానతలు మరింత పెంచుతారా.. ఇదే విజన్–2047 లక్ష్యమా? అని నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లాకు చెందిన ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు నోరు మెదపకపోవడంపై సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

వైఎస్ఆర్, జగన్ హయాంలోనే....

వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం అవసరమైన భూమిని సైతం సేకరించారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) ఆధ్వర్యంలో వైజాగ్–చెన్నై ఇండ్రస్టియల్ కారిడార్ అభివృద్ధి అవుతోంది. ఇందులో భాగంగా కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కు ఉత్తర బ్లాక్ కోసం 3958 ఎకరాలు, దక్షిణ బ్లాక్‌కు 2781 ఎకరాలు కలిపి మొత్తం 6739 ఎకరాలను సేకరించి అభివృద్ధి చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఏర్పాటైంది. మౌలిక సదుపాయాల కోసం రూ. 158.56 కోట్లను కేటాయించారు. అలాగే మైదుకూరు నుంచి పైపులైన్, ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం, కృష్ణాపురం నుంచి రైల్వేలైన్ వంటి పనుల కోసం ప్రధానమంత్రి గతిశక్తి పథకం కింద రూ. 225 కోట్లు మంజూరు చేయించారు. ఇప్పటికే అక్కడ కొన్ని పరిశ్రమలు ఏర్పాటై ఎంతోమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు.

టెక్నాలజీ సెంటర్ మంజూరు

కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కు మరింత అభివృద్ధి చేసేందుకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రూ. 250 కోట్ల వ్యయంతో టెక్నాలజీ సెంటర్‌ను తీసుకొచ్చారు. ఎంఎస్‌ఎంఈల మధ్య పోటీ పెంచేందుకు ఇది దోహదపడుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య, నైపుణాభివృద్ధి శిక్షణ ఇందులో కల్పిస్తారు. ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) అనుమతించిన యువతకు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, అలాగే డిప్లొమా ప్రోగ్రామ్స్‌ను వివిధ ఇంజనీరింగ్ రంగాలకు సంబంధించిన కోర్సులను టెక్నాలజీ సెంటర్ అందిస్తుంది. దీంతోపాటు టూల్స్, మ్యానిఫ్యాక్చరింగ్, ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి అవసరమైన సేవలు ఈ సెంటర్ ద్వారా పొందవచ్చు. ఇప్పటికే విశాఖలో ఒక సెంటర్ ఉండడంతో ప్రాంతాల మధ్య అభివృద్ధిలో అసమానతలు ఉండరాదన్న దృష్టితో జగన్ ప్రభుత్వం కొప్పర్తిలో ఈ సెంటర్‌ను మంజూరు చేయించింది.

నోరు మెదపని కూటమి నేతలు

రాయలసీమలోని ఇతర జిల్లాలతోపాటు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో కూడా అధిక శాసనసభ స్థానాలను ప్రజలు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు కట్టబెట్టారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల పెంపునకు ఎంతగానో దోహదపడే కొప్పర్తి టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలిస్తూ ప్రభుత్వం మంగళవారం జీఓ ఎంఎస్ నెంబరు 56 జారీ చేసింది. దీనిపై ఎన్డీఏ కూటమి ప్రజాప్రతినిధులుగానీ, నాయకులుగానీ నోరు మెదపకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

‘ఎంఎస్ఎంఈ’ తరలింపు దారుణం

మీడియాతో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైఎస్సార్ జిల్లా కొప్పర్తి పారిశ్రామిక వాడలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను గుంటూరుకు తరలించి.. చంద్రబాబు మరోమారు తన మోసపు నైజాన్ని బయటపెట్టారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో అధిక సీట్లు ఇచ్చినప్పటికీ చంద్రబాబు వైఖరి, నైజం మారలేదని మండిపడ్డారు. 2014–19లో జిల్లాకు వచ్చిన ఉర్దూ యూనివర్శిటీని కర్నూలుకు తరలించారని గుర్తు చేశారు. మంజూరైన మెడికల్ కళాశాల సీట్లు కూడా వద్దంటూ కేంద్రానికి లేఖ రాసిన చంద్రబాబు చరిత్రహీనుడిగా నిలిచిపోతారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం తరలించిన టెక్నాలజీ సెంటర్ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, టీటీడీ మాజీ మెంబర్ యానాదయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పులి సునీల్ పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ తరలించవద్దు



అరకొరగా బతుకుతున్న రాయలసీమ ప్రజలను నిలువెల్లా ఎండగట్టడం తగదు. ఆకలితో గొంతెండుతున్న సీమ ప్రజలపై కూటమి ప్రభుత్వం వ్యతిరేకమైన చర్యలు తీసుకుంటోంది. రాయలసీమ ప్రజల ప్రయోజనాలని పణంగా పెట్టే కార్యక్రమాల్ని చేపడుతోంది. అసలే అరకొరగా ఉన్న పరిశ్రమలను అమరావతికి తరలించుకుపోవడం ఎంతవరకు సమంజసం. – రవిశంకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఆర్‌సీపీ

బాబు వైఖరి క్షమించరానిది



కొప్పర్తి మేఘ ఇండస్ట్రియల్ హబ్ అనుసంధానంగా మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ టెక్నాలజీ, టెస్టింగ్ సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమరావతికి తరలించడం దారుణం. జగన్ పై కోపంతో కడపను శపిస్తున్న బాబు వైఖరి క్షమించరానిది. రాయలసీమ కరువు పీడిత ప్రాంత నిరుద్యోగులకు అన్యాయం చేయడం సరికాదు.

– జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి, సీపీఎం

అసెంబ్లీలో నిలదీస్తా



కొప్పర్తికి మంజూరైన టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలించుకుపోవడం సీమపై సీఎం చంద్రబాబునాయుడుకు ఉన్న వివక్షకు అద్దం పడుతోంది. అన్నీ అమరావతిలోనే ఏర్పాటు చేయడం వల్ల ప్రాంతాల మధ్య అభివృద్ధిలో అసమానతలు మరింత పెరుగుతాయి. టెక్నాలజీ సెంటర్ తరలింపు విషయంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని అసెంబ్లీలో గట్టిగా నిలదీస్తాం. – అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

బాబుకు రివాజుగా మారింది



గతంలో పద్మావతి వర్శిటీ మెడికల్ సీట్లను ఆరు సూత్రాల పథకానికి విరుద్ధంగా ప్రాంతీయేతరులకు కట్టబెట్టేందుకు ప్రయత్నించారు. కడప ఉర్దూ యూనివర్శిటీని తరలించారు. నిన్నగాక మొన్న పులివెందుల మెడికల్ కళాశాల ప్రారంభాన్ని అడ్డుకున్నారు. తాజాగా కొప్పర్తి టెక్నాలజీ సెంటర్ అమరావతికి తరలించారు. చంద్రబాబుతీరు సరికాదు. – శారద, జెడ్పీ వైస్ చైర్ పర్సన్, కడప

‘సీమ’కు ద్రోహమే



చంద్రబాబు ఏరోజూ రాయలసీమ సమస్యలను పట్టించుకోకపోగా ద్రోహమే చేస్తూ వచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఒకసారి మంజూరు చేసిన టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలించుకుపోవడమంటే ఏమనాలి? దీనిపై కూటమి ఎమ్మెల్యేలు మాట్లాడకపోవడం క్షమించరాని విషయం. – సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు, రాయలసీమ కార్మిక కర్షక సమితి, కడప

సీమకు తీరని అన్యాయం



ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమకు తీరని అన్యాయం చేస్తున్నాడు. కొప్పర్తి సెజ్‌లో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. ఈ సమయంలో ఎంఎస్ఎం టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలించుకుపోవడం బాధాకరం.

– జి. ఈశ్వరయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఇదో దుర్మార్గ చర్య



ఎంఎస్ఎంఈతో ఈ ప్రాంత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు, నిరుద్యోగ యువతకు ఉపయోగపడుతుంది. అలాంటి సంస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడప జిల్లాపై కక్ష సాధింపుతో సీఆర్‌డీఏకు తరలిస్తూ జీవో నెంబర్ 56 ను తీసుకురావడం దుర్మార్గం

– జి. చంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఇవి కక్షసాధింపు చర్యలు



ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ కక్షసాధింపు చర్యను మానుకోవాలి. మొన్న పులివెందుల మెడికల్ కాలేజ్ మెడికల్‌లో సీట్లను రద్దు చేశారు. తాజాగా కొప్పర్తిలోని టెక్నాలజీ పార్క్‌ను అమరావతికి తరలించారు. సీఎం తక్షణమే సంబంధిత జీవో రద్దు చేయాలి.– ఓబులేసు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య

అంచెలంచెలుగా అభివృద్ధి: మంత్రి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం జిల్లాను అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తుందని రాష్ట్ర రవాణ, యువజన క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. జెడ్పీ చైర్మన్‌గా ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఉన్న సమయంలో రూ. 454.50 లక్షల జెడ్పీ నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను బుధవారం మంత్రి ప్రారంభించారు. ఎన్నికల హామీలను అన్ని ప్రభుత్వం అమలు చేసి జిల్లాను, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉందని ఆయన అన్నారు. దీపావళి పండుగ రోజు మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందించనున్నామన్నారు. అతి త్వరలోనే మహిళా మూర్తులకు ఒక శుభవార్త చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కడప, కమలాపురం ఎమ్మెల్యే మాధవీరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, కలెక్టర్ శివశంకర్ లోతేటి, అధికారులు పాల్గొన్నారు.



షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి, చిత్రంలో ఎమ్మెల్యేలు ఆకేపాటి, మాధవి, కలెక్టర్

క్లీన్ అండ్ గ్రీన్ నగరంగా కడప

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ శివశంకర్ పిలుపునిచ్చారు. బుధవారం రాయచోటి రహదారిలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద స్వచ్ఛతా హి సేవ సైకిల్ ర్యాలీని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబరు 2వ తేది ఈ కార్యక్రమం ముగుస్తుందన్నారు. పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ కార్యక్రమంలో కాలేజీ, పాఠశాల విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు.

జిల్లాలో పటిష్టంగా ఉచిత ఇసుక సరఫరా: జిల్లాలో ఉచిత ఇసుక సరఫరాను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ లోతేటి రాష్ట్ర గనులు భూగర్భ శాఖ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌కు వివరించారు. ఉచిత ఇసుక సరఫరా అంశంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయా అంశాలలో జిల్లాలో తీసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్ ఆయనకు వివరించారు.

జడిపట్టిన వాన



వల్లూరు: వర్షానికి నేలకొరిగిన వరి

- జిల్లావ్యాప్తంగా భారీ వర్షం
- బి.మఠంలో 130.2 మి.మీ వర్షం
- వంక నీటి ఉధృతితో బి.మఠం–బద్వేల్ రాకపోకల బంద్
- జిల్లాలో పొంగిపొర్లిన వంకలు, వాగులు

కడప అగ్రికల్చర్/ఎర్రగుంట్ల/చాపాడు/వల్లూరు: అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. దీంతో పలు వాగులు..వంకలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. అలాగే పంటపొలాల్లో సైతం వర్షం నీరంతా నిలిచింది. జిల్లాలోని బ్రహ్మంగారిమఠంలో అత్యధికంగా 130.2 మి.మీ వర్షం కురిసింది. దీంతో బ్రహ్మంగారిమఠం మండలం సోమిరెడ్డిపల్లె వద్ద ఉన్న వంక ఉధృతంగా ప్రవహించింది. దీంతోపాటు బ్రహ్మంగారిమఠం నుంచి బద్వేల్ వెళ్లే రహదారిపై వర్షపునీరు ఉధృతంగా ప్రవహించడంతో కొద్దిసేపు రాకపోకలు ఆగిపోయినట్లు స్థానికులు తెలిపారు. అలాగే మైదుకూరు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, దువ్వూరు, పెండ్లిమర్రి, చాపాడు, వల్లూరు మండలాల్లో పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచాయి. కడప, ఎర్రగుంట్ల తదితర ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరాయి. ఈ వర్షం కొన్ని పంటలకు మేలు కలిగిస్తే.. వరి తదితర పంటలకు నష్టమేనని పలువురు రైతులు తెలిపారు. అక్కడక్కడ మినుము, నువ్వు, కొర్ర, ఎర్రగడ్డ పంటలు దిగుబడి సమయం ఆసన్నమైయింది. ఈ వర్షం ఆ పంటలకు కొంతమేర నష్టం కలిగిస్తుందని రైతులు తెలిపారు.

మండలం	నమోదైన వర్షం (మిల్లీమీటర్లలో)	మండలం	నమోదైన వర్షం (మిల్లీమీటర్లలో)
బిమఠం	130.2	సికెదిన్నె	46.2
కడప	90.2	చాపాడు	44.6
మైదుకూరు	90.0	గోపవరం	43.0
పొద్దుటూరు	82.6	పోరుమామిళ్ల	40.2
పెండ్లిమర్రి	81.2	బికోడూరు	39.4
పెద్దముడియ	81.2	వల్లూరు	34.4
దువ్వూరు	78.8	చెన్నూరు	29.0
ఎర్రగుంట్ల	70.0	వేముల	25.0
వీఎన్‌పల్లి	68.2	లింగాల	24.2
కమలాపురం	65.2	చక్రాయపేట	20.0
రాజపాలెం	65.0	సింహాద్రిపురం	18.4
బద్వేల్	64.8	కలసపాడు	15.4
తొండూరు	62.4	పులివెందుల	13.0
అట్లూరు	60.6	కొండాపురం	12.8
ముద్దనూరు	60.4	జమ్మలమడుగు	12.4
వెంపల్లి	52.8	మైలవరం	9.4
సిద్దవటం	52.8	పెద్దముడియం	8.4
కాశినాయన	49.2	ఖాజీపేట	5.4



బి.మఠం: ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు



చాపాడు: సిద్దారెడ్డిపల్లె సమీపంలో నీట మునిగిన వరి



ఎర్రగుంట్ల: మడుగును తలపిస్తున్న కాలనీ

మేడం డైరెక్షన్.. అధికారుల ఓవరాక్షన్

- వైఎస్సార్‌సీపీ నేతకు చెందిన లే అవుట్‌పై కక్ష సాధింపు
- ఆద్యంతం లైవ్‌లో పర్యవేక్షించి పైశాచిక ఆనందం
- పగులగొట్టించేంత వరకూ పట్టువీడని ఎమ్మెల్యే
- రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడా కాలువ లేని వైనం
- 100 మంది పోలీసులను మోహరింపజేసి భయోత్పాతం



లే అవుట్‌లో మ్యాపులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు



లే అవుట్‌లోని గోడను పగులగొట్టిన దృశ్యం

కడప టాస్క్‌ఫోర్స్ : వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను సామ, దాన, భేద దండోపాయాలతో టీడీపీలోకి లాక్కునేందుకు కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో పక్కా ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా కడప నగరం రామాంజనేయపురంలో వైఎస్సార్‌సీపీ నేతకు చెందిన లే అవుట్‌పై కక్షసాధింపునకు దిగి లే అవుట్‌లో గోడలను పగులగొట్టించేంత వరకూ పట్టు విడవలేదు. మేడమ్ ఆదేశాలను కలెక్టర్ నుంచి పోలీసుల వరకూ అధికారులంతా జీ హుజూర్ అని ఆచరిస్తుండటంతో నగరంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులంతా భయాందోళనకు గురవుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.. కడప నగరం చిన్నచౌకు గ్రామ పొలంలో సర్వే నంబర్ 424/4లో రామాంజనేయపురంలో 5.00 ఎకరాల భూమి గగ్గుటూరు మస్తాన్ పేరుమీద ఉంది. ఆ భూమిని మస్తాన్ ఆర్‌కే నగర్, డీసీసీ బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం తీసుకున్నాడు. ఆ రుణం కట్టకపోవడంతో బ్యాంకు వారు ఆ భూమిని బహిరంగ వేలం వేయగా గజ్జల విజయభాస్కర్‌రెడ్డి దాన్ని కొనుగోలు చేశారు. 22(ఏ)కింద డాటెడ్ ల్యాండ్‌గా ఉన్న దానిని తొలగించాలని విజయభాస్కర్‌రెడ్డి కలెక్టర్‌కు విన్నవించుకోగా, ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు 2022లో సబ్ డివిజన్ చేసి 22(ఏ) నుంచి తొలగించారు. ఆర్ఎస్ఆర్, ఆర్‌హెచ్, టెన్ వన్ వంటి అన్ని రికార్డులు పరిశీలించి గజ్జల విజయభాస్కర్‌రెడ్డికి సేల్‌డీడ్ చేశారు. 2023లో ఆయన శ్రీ బాలాజీ డెవెలపర్స్ వారికి ఆ భూమిని విక్రయించారు. అదే సంవత్సరం వారు రెవెన్యూ వారికి ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకోగా వారు అనుమతించారు. పైన జరిపిన సర్వేల్లో గానీ, ల్యాండ్ కన్వర్షన్ చేసేటప్పుడుగానీ కాలువ ఉందని ఏ అధికారులు అభ్యంతరం లేవనెత్తలేదు. రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడా అక్కడ కాలువ ఉన్నట్లు ఆనవాళ్లు లేవని తెలుస్తోంది.

కూటమి ప్రభుత్వం రాగానే వేధింపుల పర్వం

2024 ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం...కడపలో ఎమ్మెల్యేగా మాధవి గెలుపొందడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులపై వేధింపులు మొదలయ్యాయి. అక్రమ లే అవుట్ల పేరిట వైఎస్సార్‌సీపీ నేతలకు చెందిన లే అవుట్లను లక్ష్యంగా చేసుకొని ఇటీవల అమరావతి నుంచి అధికారులను రప్పించి సర్వే నిర్వహించారు. ఈ సర్వే సమయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి ముడుపులు తీసుకున్నట్లు మేడమ్‌పై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. వీటి నుంచి బయటపడేందుకు వైఎస్సార్‌సీపీ నేత ఏ. బాలక్రిష్టారెడ్డి పార్టనర్‌గా ఉన్న లే అవుట్‌ను లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రామాంజనేయపురంలోని శ్రీబాలాజీ డెవలపర్స్‌కు చెందిన లే అవుట్‌లో 2024 జూలై 2న అధికారులు బోర్డు నాటారు. దీనిపై డెవలపర్స్ వారు హైకోర్టును ఆశ్రయించగా, ఇందులో జోక్యం చేసుకోరాదని హైకోర్టు కలెక్టర్, ఆర్‌డీఓ, తహసీల్దార్‌లకు సూచిస్తూ (ఇంజెక్షన్ ఆర్డర్)ఉత్తర్వులిచ్చింది. వీటిని ఏమాత్రం లెక్కపెట్టని ఎమ్మెల్యే కలెక్టర్ ద్వారా ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తెచ్చి ప్రహరీని పగులగొట్టించినట్లు సమాచారం.

భయాందోళనకు గురైన స్థానికులు

బుధవారం ఉదయం నుంచి రామాంజనేయపురంలోని లే అవుట్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. లే అవుట్‌లో కూల్చివేతలు ఉంటాయన్న సమాచారంతో పోలీసులు, మీడియాతోపాటు కడపలోని అందరు సీఐలు, ఎస్ఐలు, సుమారు 100 మంది పోలీసులు ఆ ప్రాంతంలో మోహరించారు. ఎందుకింతమంది పోలీసులు వచ్చారో తెలియక స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఉదయం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు లే అవుట్ వద్దకు చేరుకొని భూమి పత్రాలను, మ్యాపులను పరిశీలించారు.

కక్షసాధింపులో భాగమే ఇదంతా – మేయర్, మాజీ ఎమ్మెల్యేలు

కక్షసాధింపులో భాగంగానే తమ పార్టీకి చెందిన వారి లే అవుట్‌ను కూల్చివేయాలని చూస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అవసరముందన్నారు. పాల కొండల నుంచి వచ్చే నీరు సెంట్రల్ జైలు, పాలిటెక్నిక్ కాలేజీ, వైఎస్సార్ పోలీస్ కాలనీ, చర్చిని దాటుకొని వెళ్తాయని, వీటిలో ఎక్కడా లేని కాలువ లే అవుట్‌లో మాత్రమే ఉందని చెప్పడం సరికాదన్నారు. ఎవరో ఏదో చెప్పారని అధికారులు అత్యుత్సాహం చూపడం మంచిది కాదన్నారు. తమ పార్టీ నాయకులను ఇబ్బంది పెట్టి టీడీపీలో చేర్చుకునేందుకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు.

లైవ్‌లో వీక్షించిన ఎమ్మెల్యే

లే అవుట్‌లో జరుగుతున్న పరిణామాలను ఎమ్మెల్యే ఆద్యంతం వీడియో కాల్‌లో పర్యవేక్షించినట్లు స్థానికులు చెబుతున్నారు. టీడీపీ నాయకులు రామక్రిష్ణ, రమణారెడ్డి, అందూరి రాంప్రసాద్‌రెడ్డి, పాతకడప క్రిష్టారెడ్డి, లోమడ మోహన్‌రెడ్డి తదితరులు వీడియో కాల్ చేసి ఎమ్మెల్యేకు చూపినట్లు తెలుస్తోంది. ఉదయం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కూడా ఎక్కువ మంది రావడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడతాయని భావించిన పోలీసులు, అధికారులు ...అందరూ వెళ్లిపోయిన తర్వాత సాయంత్రం జేసీబీ సాయంతో కాలువ తీసి ప్రహరీలో కొంతభాగాన్ని కూల్చివేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కాశినాయన : మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన పొన్నా వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వద్ద నుంచి బుధవారం 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి, నాటుసారా, పేకాట ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

అట్లూరు : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు అట్లూరు చెక్‌పోస్టు దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా సిద్దవటం సమీపంలోని పెన్నానది నుంచి ఇసుక లోడుతో వస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తీసుకువెళుతుండటంతో మంగళవారం రాత్రి కేసు నమోదు చేశామన్నారు.

రైలు కింద పడి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని రైలు కింద పడి రాజగోపాల్‌రెడ్డి (35) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు ఎర్రగుంట్ల పట్టణంలోని శ్రీరాములపేటకు చెందిన వ్యక్తిగా రైల్వే పోలీసులు గుర్తించారు. ప్రొద్దుటూరులోని శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు, మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా

రెండు లారీలు ఢీ

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండల పరిధిలోని తిరుపతి–ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో పాలెంపల్లె గ్రామం వద్ద బుధవారం రోడ్డుమీద ఎలాంటి సిగ్నల్స్ వేయకుండా ఆగి ఉన్న ఏకే 56 6451 నెంబరుగల లారీని తిరుపతి వైపు నుంచి ఎర్రగుంట్ల వైపు వస్తున్న టీఎస్ 50 బీజెడ్ 8525 నెంబరు గల లారీ వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన లారీ డ్రైవర్‌ను రిమ్స్‌కు తరలించారు. చెన్నూరు సీఐ పురుషోత్తంరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఎర్రగుంట్ల/ముద్దనూరు : ఎర్రగుంట్ల మండల పరిధిలోని కలమల్ల–ముద్దనూరు రైల్వే ట్రాక్ మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలులో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు ఎర్ర రంగు టీ షర్టు ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9700675792, 9440627658 ఫోన్ నంబర్లకు సమాచారం అందజేయాలని రైల్వే పోలీసులు కోరారు. మృతదేహం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉందన్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న చిన్నంరెడ్డి రామచంద్రారెడ్డి

చింతకొమ్మదిన్నె : మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన చిన్నంరెడ్డి రామచంద్రారెడ్డి (43) అనే వ్యక్తి అప్పుల బాధ తాళలేక బుధవారం తెల్లవారుజామున పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీకే దిన్నె ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపిన సమాచారం మేరకు రామచంద్రారెడ్డి మహేంద్ర షో రూమ్‌లో సేల్స్‌మెన్ గా ఉద్యోగం చేస్తూ జీవనం గడిపే వాడు. ఇతనికి భార్య తులసి తో పాటు మరో ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పులు ఎక్కువ కావడంతో బుధవారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో చింతకొమ్మదిన్నెలోని ఒక రైస్ మిల్లు వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. వారి బంధువులు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

గొర్రెల దొంగలు అరెస్టు

తొండూరు : తొండూరు మండలం కోరవానిపల్లి గ్రామంలో గొర్రెలను దొంగిలించిన నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన తొండూరు పోలీస్ స్టేషన్‌లో వారు మాట్లాడుతూ తొండూరు మండలం కోరవానిపల్లి గ్రామంలో కొప్పుల రామకృష్ణ, వెంకటరమణలు గొర్రెల దొడ్డిలో ఉన్న 8 గొర్రెలను దొంగతనం చేశారన్నారు. వీటి విలువ సుమారు రూ.1.30లక్షలు ఉంటుందన్నారు. నిందితులు కారులో అనుమానంగా తిరుగుతుండటంతో అరెస్టు చేశామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

30న కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 30న కలెక్టరేట్ ఎదుట అఖిలపక్షం ఆధ్వర్యంలో కడప ఉక్కు పరిశ్రమ కోసం ధర్నా నిర్వహించనున్నట్లు అఖిలపక్షం నాయకుడు నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని అఖిలపక్ష కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన హక్కు చట్టంలో జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మిస్తాం అని హామీ ఇచ్చారన్నారు. అలాగే కడప–బెంగుళూరు రైల్వేలైన్ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంతంలో పెండింగ్‌లోఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరారు. కొప్పర్తిలో ఏర్పాటు కావాల్సిన ఎంఎస్ఈ పరిశ్రమను విజయవాడకు తరలించే ప్రయత్నాలను ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు సీఆర్‌పీ ప్రసాద్, గుర్రప్ప, జయవర్దన్, సుబ్బరాయుడు, ఓబులేసు, శంకర్ అంజి, రాజేంద్ర పాల్గొన్నారు.

మహిళా పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు

- ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్
- జిల్లా అదనపు ఎస్పీ (ఏ.ఆర్) ఎస్.ఎస్.వి. కృష్ణారావు



స్క్రీనింగ్ పరీక్షలు చేసుకునేందుకు వచ్చిన మహిళా ఉద్యోగులు

కడప అర్బన్ : పోలీసు శాఖలోని మహిళా సిబ్బంది, వారి కుటుంబాల్లోని మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు రెండోరోజు నగరంలోని ఉమేష్ చంద్ర కళ్యాణ మండపంలో కొనసాగాయి. పోలీసు సంక్షేమంలో భాగంగా జిల్లా ఎస్పీ వి. హర్షవర్దన్ రాజు ప్రత్యేక చొరవ, విజయవాడ మణిపాల్ ఆసుపత్రి సహకారంతో ఉచితంగా నిర్వహించే బ్రెస్ట్, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు (పాప్ స్మియర్, మామోగ్రాం) విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ (ఏఆర్) ఎస్.ఎస్.వి కృష్ణారావు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అనారోగ్య లక్షణాలు గుర్తిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్యాన్సర్‌కు సంబంధించి స్క్రీనింగ్ అనేది ముఖ్యమైన ప్రక్రియ అన్నారు. 26తేదీన గురువారం వరకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మణిపాల్ ఆసుపత్రి రేడియేషనల్ ఆంకాలజిస్ట్ స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ శ్రీదివ్య, ఏ.ఆర్. డీఎస్పీ మురళీధర్, జిల్లా పోలీస్ సంక్షేమ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ మేరీ సుజాత, ఆర్ఐలు టైటస్, శ్రీశైలరెడ్డి, మహిళా ఎస్ఐలు పావని, శాంతమ్మ, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, రవిశంకర్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, మణిపాల్ ఆసుపత్రి క్యాంప్ కో–ఆర్డినేటర్ ఏ. వినోద్‌కుమార్, మహిళా కానిస్టేబుళ్లు లక్ష్మిదేవి, మాధవీలత, కృష్ణవేణి, లీల, మహిళా పోలీస్, హోమ్‌గార్డులు, డీపీఓ సిబ్బంది, వారి కుటుంబాల మహిళలు పాల్గొన్నారు.

గ్రీన్‌హైవే రోడ్డు నిర్మాణం అడ్డగింత



విలేకరులతో మాట్లాడుతున్న రోడ్డు భూ బాధితులు

బ్రహ్మంగారిమఠం : బెంగుళూరు నుంచి అమరావతికి భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రీన్ హైవే రోడ్డు నిర్మాణ పనులను మండలంలోని లింగాలదిన్నెపల్లెకు చెందిన భూ నిర్వాసితులు భూమిరెడ్డి సిద్దారెడ్డి మరి కొంతమంది బుధవారం అడ్డుకున్నారు. బి.మఠం తహసీల్దార్ కార్యాలయ పరిశీలనకు వచ్చిన బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, తహసీల్దార్ దామోదర్‌రెడ్డిలు సమస్యను తెలుసుకొని పొలం దగ్గరకు వెళ్లారు. ఈ సందర్భంగా సిద్దారెడ్డి మాట్లాడుతూ మల్లేపల్లె పొలం సర్వే నంబర్ 10లో 2.50 ఎకరాలు తమ పిత్రార్జితానికి చెందిన భూమి అన్నారు. ఈ భూమిపై కొందరు తప్పుడు పత్రాలు తయారు చేసుకొని తమకు భాగం ఉందని అడ్డు తగులుతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన నష్టపరిహారం వచ్చే వరకు రోడ్డు నిర్మాణం నిలుపుదల చేయాలని కోరారు. ఆర్డీఓ చంద్రమోహన్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నష్టపోయిన లబ్ధిదారులకు తప్పకుండా నష్టపరిహారం వస్తుందన్నారు. అనంతరం భూ బాధితులు ఆర్డీఓకు వినతి పత్రం ఇచ్చారు.

ఎస్‌జీఎఫ్ కరాటే జిల్లా జట్లు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన అండర్–14, అండర్–17 బాలికలు

కడప స్పోర్ట్స్/రాజంపేట : రాజంపేట పట్టణం నూనెవారిపల్లె రోడ్డులోని కరాటే శిక్షణ కేంద్రంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లాస్థాయి కరాటే ఎంపికలు నిర్వహించారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో నిర్వహించిన ఎంపికలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రకటించారు. కార్యక్రమంలో కరాటే శిక్షకుడు, ఎంపికల కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆనంద్, శిక్షకుడు కొన్నిపాటి వెంకటేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్–17 బాలురు : ఎం. లోకేష్, ఆర్. నాగతేజ, టి. పవన్‌కుమార్, పి. పవన్‌కల్యాణ్, ఎ. ప్రవీణ్‌కుమార్, పి.హర్షసాయివర్దన్, జె. జశ్వంత్, ఎస్. గుణవర్దన్.

అండర్–14 బాలురు : ఎస్ఎండీ రయాన్, పి.హర్షాఆనంద్, డి. సాదిక్‌అలీ, పి. జీవన్‌రెడ్డి, డి. గురుయశ్వంత్‌కుమార్, పి. తనీశ్వర్‌రెడ్డి, పి. మెహర్నీష్, ఎస్. నవాజ్ ఉర్ రెహమాన్, టి. మేఘశ్యామ్.

అండర్–14 బాలికలు : డి. మదీహ నుశ్రాత్, బి.రూపాశ్రీ, జె.షకినా, టి. హిరణ్మయి.

అండర్–17 బాలికలు : ఎం. స్వాతి, ఎ.లలిత, ఎస్. తమీమ్, నాగమోక్షిత, దేవిక

ప్రచార కార్యక్రమాల నుంచి తప్పించండి

జేసీకి ఏఎన్ఎంల వినతి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వ వంద రోజుల పాలనను పురస్కరించుకుని ఇది మంచి ప్రభుత్వం అనే ప్రచార కార్యక్రమం నుంచి తమను తప్పించాలని ఏఎన్ఎంలు బుధవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. పంచాయతీరాజ్‌శాఖ జారీ చేసిన నిబంధనలు వెనక్కి తీసుకోవాలని కోరారు. టీకాలు వేయాలని ఓవైపు ఆరోగ్యశాఖ అధికారులు ఆదేశిస్తున్నారని, మరో వైపు ప్రచారంలో పాల్గొనాలని పంచాయతీరాజ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో తమపై పనిభారం పెరిగిందన్నారు. ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అంటించడం వంటి పనులు అప్పగించకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, సచివాలయ ఏఎన్ఎంల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కమాల్‌బీ, అధ్యక్షురాలు ఎం.ప్రవీణ, నాయకులు రజని, సుజాత, బుజ్జమ్మ, ఎలీజమ్మ తదితరులు పాల్గొన్నారు.


అక్టోబర్ 4,5,6 తేదీల్లో రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ క్రీడలు

కడప ఎడ్యుకేషన్ : యూటీఎఫ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ క్రీడలు నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. ఈమేరకు రాష్ట్ర రవాణా, క్రీడలు మరియు యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఆహ్వానించామన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాలలో జిల్లా స్థాయిలో ఎంపికైన ఉపాధ్యాయులందరూ గుంటూరులో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, చంద్ర ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4 కేజీల జంతు మాంసం స్వాధీనం

వేంపల్లె : మండలంలోని ఎగువ తువ్వపల్లె గ్రామంలో 4 కిలోల జంతు మాంసం పట్టుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి బాలసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం అందిన సమాచారం మేరకు ఫారెస్ట్ సిబ్బంది ఎగువ తువ్వపల్లె గ్రామంలో దాడులు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామానికి గొందిపల్లె వెంకటపతి, గొందిపల్లె నడిపి మునెయ్య, తాళ్లపల్లె మునెయ్యలు అడవి జంతు మాంసాన్ని వండేందుకు సిద్ధంగా ఉండగా ఫారెస్ట్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. చిలేకాంపల్లె సిద్దారెడ్డి అనే రైతు తన పొలానికి విద్యుత్ తీగలు లాగడంతో కరెంటు షాక్‌తో అడవి జంతువు మృతి చెందిందని.. దీన్ని ఇవ్వడంతో వండుకొనేందుకు సిద్ధం చేసుకున్నట్లు వారు చెప్పారు. ఈ మేరకు ఫారెస్ట్ రేంజర్ కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేశారు.

డీన్ అకడమిక్‌గా రమేష్ కైలాస్ బాధ్యతలు



డీన్ అకడమిక్‌గా బాధ్యతలు చేపడుతున్న రమేష్ కైలాస్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్‌గా బాధ్యతలు చేపడుతున్న వెంకటేష్

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో పలు శాఖలకు అధికారులను నియమించినట్లు డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో డీన్ అకడమిక్‌గా సివిల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ దండుకర్ రమేష్ కైలాస్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే డీన్ స్టూడెంట్ వెల్ఫేర్‌గా సివిల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.వెంకటేష్ బాధ్యతలు చేపట్టారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారులను ట్రిపుల్ ఐటీ అధ్యాపకులు సత్కరించారు.

వ్యక్తిపై రాడ్లతో దాడి



ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రామాంజనేయులు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం రాజారెడ్డి కాలనీ సమీపంలో వేముల మండలం చాగలేరు గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే వ్యక్తిపై బుధవారం రాడ్లతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు రామాంజనేయులుకు రాజారెడ్డి కాలనీ సమీపంలో నివాసముంటున్న ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉందేమో అనుమానంతో ఆమె కొడుకులు సందీప్, శివ నాగేంద్రలు రామాంజనేయులుతో ఘర్షణ పడ్డారు. వారు అక్కడే ఉన్న రాడ్లు తీసుకుని తలపై బలంగా కొట్టడంతో రోడ్డుపై రామాంజనేయులు రక్తపు గాయాలతో పడిపోయాడు. వెంటనే అక్కడున్న వారు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు.

ఇరు వర్గాల ఘర్షణ

అట్లూరు : మండల పరిధిలోని వేమలూరు ఎస్సీ కాలనీకి చెందిన ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వేమలూరు ఎస్సీ కాలనీలో మంగళవారం రాత్రి ఇరువర్గాలు ఘర్షణ పడ్డారన్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పొగడతోట మనోహర్ మరో ఆరు మందిపై అలాగే పొగతోట గంగయ్య మరో ఐదుగురిపై కేసు నమోదు చేశామన్నారు. మళ్లీ ఘర్షణలకు దిగకుండా ఉండేందుకు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు.